సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 11 । జూలై । 2025



ద్రవరూపంలో యూరియా

గుళికల రూపంలో ఉన్న యూరియా, డీఏపీని కేంద్ర ప్రభుత్వం ద్రవ రూపంలో తయారు చేస్తోంది. 8లో▸



పకడ్బందీగా ఓటరు నమోదు

ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. 8లో▸



భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

గురుపౌర్ణమిని పురస్కరించుకొని గురువారం ప్రధాన ఆలయాల్లో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9లో▸

నేడు తాండూరు మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'

తాండూరు: మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డితో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆయా వార్డుల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, తాగునీటి సరఫరా
మున్సిపాలిటీ : తాండూరు
కమిషనర్: విక్రమ్‌సింహారెడ్డి
తేదీ: 11-7-2025 (శుక్రవారం)
సమయం: ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్:
98499 05909

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బషీరాబాద్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శివగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక పద్ధతిన పోస్టుల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమెస్ట్రి, వృక్షశాస్త్రం, జువాలజీ, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 14వ తేదీలోపు రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఎంఈఓ కార్యాలయానికి తాళం వేసి కార్మికుల ఆందోళన



ఏంఈఓ కార్యాలయానికి తాళం వేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు స్వప్న

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయానికి కార్మికులు తాళం వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ.. ఏడాదిగా బిల్లులు, గౌరవ వేతనం చెల్లించడం లేదని అన్నారు. గుడ్లు, రాగిజావ పెట్టాలని ప్రభుత్వం చెబుతోంది తప్ప అందుకు తగ్గ నిధులు మంజూరు చేయడంలేదన్నారు. అప్పులు చేసి గుడ్లు తీసుకొచ్చి పెడుతున్నప్పటికీ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఎంఈఓ, ఎస్‌టీఓ, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా మోక్షం కలగడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఐ నాగరాజు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి తాళం తీయించారు. ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఆందోళనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం!

భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి కసరత్తు

- గత నెల 3నుంచి 15 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు
- అక్కడికక్కడే పరిష్కరించిన వినతులు 15,119
- రైతుల నుంచి వచ్చిన మరో 11,802 అర్జీలు
- మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించినవి 4,013



నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లిలో భూ భారతి రెవెన్యూ సదస్సు(ఫైల్)

వికారాబాద్: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన భూభారతి రెవెన్యూ చట్టం రైతుల పాలిట వరంగా మారనుంది. ఇటీవల జిల్లా వ్యాప్తంగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు తీసుకున్న విషయం తెలిసిందే. వాటి పరిష్కారానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కుప్పలుతెప్పలుగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న వివాదాలు, వ్యాజ్యాలు మినహా మిగిలిన అన్ని దరఖాస్తులను ఆగస్టు 14వ తేదీ లోగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత నెల 2వ తేదీ నుంచి కొత్తచట్టం అమలులోకి రాగా 3వ తేదీ నుంచి 15 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అక్కడికక్కడే 15,119 భూ సమస్యలను పరిష్కరించారు. జిల్లా రైతుల నుంచి మరో 11,802 దరఖాస్తులు స్వీకరించారు. డాటా ఎంట్రీ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. ప్రస్తుతం భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శ్రమిస్తున్నారు.

కుప్పలు తెప్పలుగా..

కొంత కాలంగా రెవెన్యూ అధికారులు భూ సమస్యల పరిష్కారం కోసం కుస్తీ పడుతూ వస్తున్నారు. గతంలో కలెక్టర్ లాగిన్‌లో భూ సమస్యలకు సంబంధించి ఐదు వేల దరఖాస్తులు ఉండేవి. వాటిని 500లకు తెచ్చారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. మిస్సింగ్ సర్వే నంబర్లు, సాదాబైనామా, అసైన్డ్ భూముల సమస్యలు, పీఓటీ, విరాసత్, మ్యుటేషన్, డేటా కరెక్షన్ తదితర వాటిపై 11,802 అర్జీలు వచ్చాయి. వీటిలో మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 4,013 దరఖాస్తులు, డీఎస్ పెండింగ్‌కు సంబంధించి 1,604, సక్సేషన్‌కు సంబంధించి 1,654 , ఎక్సెంట్ మిస్సింగ్‌కు సంబంధించి 690 అర్జీలు వచ్చాయి. ధరణి చట్టం ప్రకారం మెజార్టీ భూ సమస్యలు కలెక్టర్ లాగిన్‌లోనే ఉండేవి. కొత్తగా వచ్చిన రెవెన్యూ చట్టంలో చాలా వరకు అధికార వికేంద్రీకరణ జరిగింది. సగానికి పైగా సమస్యలు అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓలు పరిష్కరించేలా చట్టాన్ని రూపొందించారు. ఇక మీద రెవెన్యూ సమస్యల పరిష్కారం వేగవంతమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా జూన్ 3వ తేదీ నుంచి 15 రోజుల పాటు 475 రెవెన్యూ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి 11,802 దరఖాస్తులు స్వీకరించారు. అత్యధికంగా వికారాబాద్ మండలం నుంచి 1,531 దరఖాస్తులు వచ్చాయి. కుల్కచర్ల మండలం నుంచి 1,424 , పూడూరు మండలం నుంచి 1,259 దోమ మండలం నుంచి 1,104 మోమిన్‌పేట మండలం నుంచి 1,018 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా యాలాల మండల నుంచి 137, బషీరాబాద్ నుంచి 155, పెద్దేముల్ నుంచి 205 అర్జీలు వచ్చాయి. 11,802 దరఖాస్తులకు గాను 5,294 అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓ పరిధిలోకి వచ్చే కేసులకు సంబంధించి 1,141 మంది రైతులకు నోటీసులు కూడా ఇచ్చారు. ఇందులో 342 అప్రూవ్ చేశారు. 31 దరఖాస్తులను తిరస్కరించారు. ఇప్పటి వరకు 40 శాతం దరఖాస్తులను పరిష్కరించారు.

గడువులోగా పరిష్కరిస్తాం



అందరి సహకారంతో రెవెన్యూ సదస్సులను విజయవంతంగా పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా పది వేలకు పైగా అర్జీలు వచ్చాయి. ప్రస్తుతం డేటా ఎంట్రీ ప్రక్రి య జరుగుతోంది. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలను కోర్టు ఆదేశాల మేరకు పరిష్కరిస్తాం. మిగతా వాటిని ఆగస్టు 14వ తేదీలోగా పరిష్కరిస్తాం. ఇప్పటి వరకు 40 శాతం మేర సమస్యలను కొలిక్కి తెచ్చాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

విజేత ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ విచారణ

- అబార్షన్ ఘటనపై వివరాల సేకరణ
- బాధ్యులపై చర్యలు తప్పవని వెల్లడి



పరిగిలోని విజేత ఆస్పత్రిలో విచారణ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ లలితాదేవి

పరిగి: ఆరు నెలల గర్భిణికి అబార్షన్ చేసిన పట్టణంలోని విజేత ఆస్పత్రిలో గురువారం డీఎంహెచ్ఓ లలితాదేవి విచారణ చేపట్టారు. బుధవారం జరిగిన ఘటనపై ఆరా తీయడంతో పాటు రికార్డులు పరిశీలించారు. హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఇద్దరు గైనకాలజిస్టులతో పాటు అబార్షన్ చేయించుకున్న నందిని, ఆమె కుటుంబ సభ్యుల నుంచి పలు విషయాలు తెలుసుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఎచ్‌ఓలు డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆస్పత్రి గుర్తింపు రద్దు చేయాలి

భ్రూణ హత్యలకు పాల్పడిన విజేత ఆస్పత్రి గుర్తింపును రద్దు చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్, డీఎంహెచ్ఓ స్పందించి.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న హాస్పిటల్ నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు ఆస్పత్రిని మూసేయాలన్నారు. లేదంటే జిల్లా వ్యాప్త నిరసనలు చేపడుతామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యం 37మంది జననం

- లింగ నిష్పత్తిలో మెరుగు
- జిల్లాలో వెయ్యి మంది పురుషులకు 1,001 మంది స్త్రీలు
- ఏడాదికి 13,779 జననాలు
- మొత్తం జనాభా 9.27 లక్షలు
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



వికారాబాద్: గత దశాబ్ద కాలంగా చూస్తే జిల్లాలో జనాభా పెరుగుదల రేటు నిలకడగా కనిపిస్తోంది. అక్షరాస్యతా శాతంలో అట్టడుగున ఉండగా జననాల రేటులో రాష్ట్ర సగటుకు దగ్గరగానే ఉంది. లింగ నిష్పత్తి విషయంలో మన జిల్లా మెరుగ్గా ఉంది. లింగ నిష్పత్తి విషయంలో రాష్ట్ర సగటు కంటే మన జిల్లాలో ఎక్కువగా ఉంది. జిల్లాలో మొత్తం జనాభా 9.27 (2011 సెన్సెస్) లక్షలు ఉంది. ఇందులో ప్రతి వెయ్యి మంది పురుషులకు 1001 మంది మహిళలు ఉన్నారు. గడిచిన ఏడాది కాలంలో జిల్లాలో 13,779 మంది జన్మించగా ప్రతి రోజు సగటున 37మంది ప్రతి గంటకు 1.57 మంది పుడుతున్నట్టు ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. చిన్న పిల్లల లింగ నిష్పత్తి విషయంలో మర్పల్లి మండలంలో ప్రతి వెయ్యి మంది బాలురకు 1022 మంది బాలికలు అత్యధికంగా ఉండగా యాలాల మండలంలో అత్యల్పంగా ప్రతి వెయ్యి మందికి 900 బాలికలు ఉన్నారు. అక్షరాస్యతా శాతంలో జిల్లాలో వికారాబాద్ మండలం ముందుండగా దౌల్తాబాద్ అన్ని మండలాల కంటే అట్టడుగున ఉంది. మొత్తం జనాభాలో పట్టణ జనాభా 87 శాతం ఉండగా గ్రామీణ జనాభా 13శాతం ఉన్నారు. విస్తీర్ణంలో వికారాబాద్ మండలం పెద్దదిగా ఉండగా జనాభా పరంగా తాండూరు మండలంలో అత్యధిక జనాభా నివసిస్తున్నారు. మొత్తం జనాభా 9,27,140లో 4.7 లక్షల జనాభా ఆయా పనులకు వెళుతున్నారు. ఇందులో 1.65 లక్షల మంది రైతులుగా, 1.91 లక్షల మంది వ్యవసాయ కూలీలుగా ఇంటి పనులకు 0.10 లక్షలు, 1.03 లక్షల జనాభా ఇతర పనులకు వెళుతున్నారు.



విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

- ప్రతి విద్యార్థి మెరిట్‌లో పాసవ్వాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు.. రోజూ ఎంత మంది వస్తున్నారు.. గుడ్లు, పాలు ఇస్తున్నారా, బాలామృతం ప్లష్ ఇస్తున్నారా, దివ్యాంగులు, తీవ్ర, అతితీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. అనంతరం హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పిల్లలకు యూనిఫామ్స్ వేసి, చార్టుపై రాసి పిల్లలతో చదివించాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఎనిమిది, పదో తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఇంగ్లిష్‌పై పట్టు ఉండాలన్నారు. ఇంగ్లిష్ పద్యాలు చదివించారు. 8వ తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌పీ ద్వారా బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. పోటీతత్వంలో ముందుకు సాగాలని సూచించారు. తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. వంట గది, కొత్తగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. వంట తయారు చేసే విధానాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్, బియ్యం, సరుకుల నిల్వలను చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి మెరిట్ సాధించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలలో పెండింగ్ పనులు ఉంటే సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ఎంఈఓ బాబు సింగ్, హెచ్‌ఎం శివకుమార్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

వైభవం.. పెరుగుబసంతం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- గరుడ వాహనంపై విహరించిన అనంత పద్మనాభుడు
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్



ఉట్టి కొట్టే వేడుకను తిలకిస్తున్న భక్తులు



పట్టువస్త్రాలు తెస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: అనంతగిరి గుట్టపై వెలసిన శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయ ఆషాఢమాస చిన్నజాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం పెరుగుబసంతం వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల మధ్య కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారిని ప్రతిష్ఠించి ఆలయ పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ పెరుగుబసంతంకు సంబంధించిన ప్రత్యేక మహా ప్రసాదాన్ని తయారు చేసి ఉట్టిలో ఉంచారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఉత్సవ స్తంభంపైకి ఉట్టిని ఎక్కించారు. ఉట్టిని పగుల గొట్టి మహా ప్రసాదన్ని భక్తులకు చల్లారు. ప్రసాదం అందుకోవడానికి భక్తులు ఆరాట పడ్డారు. అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహా ప్రసాదాన్ని పొలాల్లో చల్లితే..

పెరుగుబసంతంలో పంచే మహా ప్రసాదాన్ని పొలాల్లో చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని, ఇంట్లో ఉంచితే కష్టాలు తొలగిపోయి అష్టైశ్వర్యాలు కలుగుతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.గరుడ వాహన సేవలో, పెరుగుబసంతం వేడుకల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్పీకర్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. వేడుకల్లో ఆలయ ఈవో నరేందర్, ట్రస్టీ పద్మనాభం, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు
- అదనపు కలెక్టర్ సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2025లో భాగంగా ప్రతి గ్రామంలో వంద మంది పౌరులతో యాప్‌లో ఫీడ్ బ్యాక్ ఇచ్చేలా పంచాయతీ సెక్రటరీలు చర్యలు తీసుకునేలా చూడాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్ని మండలాల ఎంపీడీఓలకు సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి పలు అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఇంకుడు గుంతలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 19 కొత్త జీపీల్లో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేసి నాటేలా చూడాలన్నారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అలసత్వానికి తావులేకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ జయసుధ, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, పీఆర్ ఈఈ ఉమేష్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సుధీర్ బూత్ లెవల్ అధికారులకు సూచించారు. వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. మార్పులు చేర్పులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, బీఎల్‌ఓలు, మాస్టర్ ట్రైనర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి 'ప్రైవేటు' గండి

- పరిగి బస్టాండ్ ఎదుట పెద్ద సంఖ్యలో ప్రైవేటు వాహనాలు
- నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల తరలింపు
- పట్టించుకోని అధికారులు



పరిగి బస్టాండ్ ఎదుట ప్రైవేటు వాహనాలు

పరిగి: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వాహన యజమానులు ప్రయాణికులను తరలించి ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. పరిగి బస్టాండ్ ఎదుట ఉదయం నుంచే ప్రైవేటు వాహనాలను నిలుపుతున్నారు. బస్టాండ్‌లోకి వెళ్లే ప్రయాణికులను ఆపి తమ వాహనాల్లో ఎక్కించుకుంటున్నారు. జిల్లాలోని నాలుగు ఆర్టీసీ బస్టాండ్ల వద్ద (పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్) ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం కొడంగల్, పరిగి, తాండూరు ప్రాంతాల నుంచి ఎక్కువ మంది హైదరాబాద్‌కు వెళ్తుంటారు. ప్రైవేటు వాహన యజమానులు వారిని నిబంధనలకు విరుద్ధంగా తరలించి ఆర్టీసీకి రావాల్సిన ఆదాయన్ని కొల్లగొడుతున్నారు.

నిబంధనలు గాలికి

మోటారు వెహికల్ చట్టం ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌కు 500 మీటర్ల పరిధిలో ప్రైవేటు వాహనాలను నిలుపరాదు. కానీ పరిగి పట్టణంలో ఇది అమలు కావడం లేదు. నిబంధనలను తుంగలో తొక్కి బస్టాండ్ ఎదుటే వాహనాలను నిలిపి ప్రయాణికులకు ఎక్కించుకుంటున్నారు. ఆర్టీసీ సర్వీసులు సమయానుకూలంగా నడపకపోవడం ప్రైవేటు వాహనాలకు కలిసి వస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో మహిళల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో సీట్లు లేక పురుషులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్టాండ్ ముందే ప్రైవేటు వాహనాలను నిలుపుతున్నా ఆర్టీసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

కనిపించని స్పెషల్ టీంలు

ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి అందులో పోలీసు శాఖను భాగస్వామ్యం చేస్తూ బస్టాండ్‌కు 500 మీటర్ల పరిధిలో ప్రైవేటు వాహనాలను నిలిపితే చర్యలు తీసుకోవాలి. కొన్ని నెలలుగా ఈ టీంలు పనిచేయడం లేదు. దీంతో ప్రైవేటు వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రైవేటు వాహనాలను ఆపితే చర్యలు తీసుకుంటాం. మోటారు వెహికల్ చట్టాన్ని విధిగా పాటించాలని ఆదేశాలు జారీ చేస్తాం. బస్టాండ్ వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించి ప్రైవేటు వాహనాలను కట్టడి చేస్తాం. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి.

– సుఖేందర్‌రెడ్డి, డీఎం, పరిగి

క్లుప్తంగా

అంగన్‌వాడీ భవన నిర్మాణం ప్రారంభం



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో రూ.వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. మండల కేంద్రంలో రెండు అంగన్‌వాడీ భవనాలకు రూ.40లక్షలు నిధులు మంజూరయ్యాయని వాటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దస్తప్ప, సహకార సంఘం డైరెక్టరు ఆశప్ప, ఏఈ నాగేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విమల

బంట్వారం: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ విమల సూచించారు. గురువారం ఆమె బంట్వారం చౌరాస్తాలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్సు దిగి నడుచుకుంటే వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 100కి కాల్ చేయాలని బాలికలకు సూచించారు. అంతకుముందు ఆమె వాహనాలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అనంతగిరి: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) నర్సింలు, రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం వికారాబాద్‌లోని విద్యుత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్థ చేపట్టే విద్యుత్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదల చేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అవసరమయ్యే సామగ్రిని మంజూరు చేశామన్నారు. అధికారులు తమ తమ హెడ్‌క్వార్టర్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఈ రవిప్రసాద్, డీఈలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



సూచిక బోర్డు పాతిన రెవెన్యూ సిబ్బంది

అనంతగిరి: ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని కొత్రెపల్లి రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 164 ప్రభుత్వ భూమి అక్రమణకు గురైన సమాచారంతో అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి అన్యాకాంత్రం అయిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరేష్ , సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకున్న రైతు

పరిగి: కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పత్తి జంగయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం భూమి, ఇల్లు విషయంలో కుటుంబీకులు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి చెందిన జంగయ్య పొలం దగ్గర చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య పెంటమ్మ, కొడుకు నర్సింహులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్రవరూపంలో యూరియా

నానో డీఏపీతో రైతుకు ప్రయోజనం

- ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం



నానో యూరియా, డీఏపీ సీసా

మోమిన్‌పేట: కేంద్ర ప్రభుత్వం గుళికల రూపంలో ఉన్న యూరియా, డీఏపీలకు బదులుగా ద్రవ రూపంలో తయారు చేస్తుంది. దీంతో రైతుకు రవాణా, దూరభారం, ధర తగ్గుతుంది. అర లీటరు నానో యూరియా, డీఏపీ ఒక బస్తా యూరియా, డీఏపీతో సమానం. పత్తి, కూరగాయల సాగుకు పైపాటుగా పిచికారీ చేయాలి. దుకాణం నుంచి తీసుకురావడం, పొలానికి తీసుకుపోవడం నానో యూరియా, డీఏపీ చాలా సులువు. అదే బస్తా తీసుకెళ్లడంతో అన్నదాతలకు భారం అవుతుంది. ఒక బస్తా గుళికల యూరియా ఎకరా పొలంలో వాడటంతో 60 శాతం మాత్రమే మొక్క గ్రహించగలుగుతుంది. మిగతా 40శాతం గాలిలో కలిసి వాయు కాలుష్యం ఏర్పడుతుంది. డీఏపీ కూడా దుక్కిలో వేయాల్సి ఉన్న పైపాటుగా వేయడంతో నష్టమే కానీ మొక్కకు ఎలాంటి ఫలితం దక్కదు. రైతులు నానో యూరియా, డీఏపీలను నేరుగా కానీ ఏదైన పురుగు మందులో కలిపి పత్తిపై పిచికారీ చేయాలి. పిచికారీ చేయడంతో నేరుగా ఆకుల ద్వారా మొక్క వంద శాతం గ్రహిస్తుంది. రసాయనిక ఎరువులు నేరుగా భూమిలో వేయడంతో భూసాంద్రత తగ్గుతుంది. వర్షాభావ పరిస్థితిలో, అధిక వర్షపాతంలోను నానో యూరియాను పంటపై పిచికారీ చేయవచ్చు. దీంతో పంట ఎదుగుదల ఎక్కడ ఆగదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం డీఏపీని కూడా ద్రవ రూపంలో తయారు చేస్తుంది. రైతులు సేంద్రియ ఎరువులను భూమిలో వేసి కలియదున్నుకొని నానో ఎరువులను పంటలపై పిచికారీ చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు సూచించారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుతం పత్తి విత్తనాలు విత్తుకొని నెల రోజులు కావొస్తుంది. వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తున్నాయి. పైపాటుగా నానో డీఏపీని మొదటి సారి పిచికారీ చేసుకోవచ్చు. తిరిగి రెండోసారి 50 రోజులకు పిచికారీ చేసుకోవాలి. ఎకరాకు ఒక లీటరు రెండు దఫాలుగా పిచికారీ చేయాలి. నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా చాలా మంది రైతులకు నానో డీఏపీ, యూరియాలపై అవగాహన లేదు. ప్రతి ఫర్టిలైజరు దుకాణాలలో విరివిగా నానో యూరియా, డీఏపీలను అందుబాటులో ఉంచాలి. రానురాను అన్ని రసాయనిక ఎరువులు ద్రవ రూపంలో వస్తాయి. **– జయశంకర్, ఏఓ, మోమిన్‌పేట**

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత ముఖ్యం

మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప

దుద్యాల్: ప్రజల ఆరోగ్యంపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఈ నెల 9న సాక్షి దినపత్రికలో 'ప్రమాదంలో ప్రజారోగ్యం' అనే కథనంతో యంత్రాంగంలో కదలిక ప్రారంభమైంది. మండల పరిధిలోని చెట్టుపల్లి తండాలో వైద్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో కలిసి తండాలోని వీధుల గుండా తిరుగుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. వీధుల్లో ఎక్కడంటే అక్కడ చెత్త చెదారం వేయకుండా చూడాలన్నారు. మురుగు కాలువలను పరిశీలించి పంచాయతీ కార్మికుల సహాయంతో శానిటైజేషన్ చేయించారు. ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సూచించారు. ఇళ్ల ముందు డ్రమ్ములలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. ఇంటింటికి తిరిగి ఫీవర్, లార్వా సర్వే చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ షాహిదా బేగం, విజయలక్ష్మి, హెల్త్ కాలేజీ కో ఆర్డినేటర్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెట్టుపల్లితండాలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పకడ్బందీగా ఓటరు నమోదు



పూడూరు: మాట్లాడుతున్న ఆర్డీఓ వాసుచంద్ర



దౌల్తాబాద్: శిక్షణలో పాల్గొన్న బీఎల్‌ఓలు

వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర

పూడూరు: గ్రామాలకు వెళ్లే అధికారులు ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌ఓ, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనేది సరి చేయాలన్నారు. తప్పులు, ఒప్పులు సరి చేయడంతో పాటు డబుల్ ఉన్న ఓట్లను తొలగించాలని చెప్పారు. ఓటరు జాబితాను తప్పులు లేకుండా తయారు చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను సేకరించాలన్నారు. జాబితా నుంచి ఓటరును ఎలా తొలగించాలనేది వివరంగా తెలిపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భరత్‌గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఎల్‌ఓల పాత్ర కీలకం

దౌల్తాబాద్: క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణ కీలకమని తహసీల్దారు గాయత్రి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బీఎల్‌ఓలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎన్నికల బాధ్యత బీఎల్‌ఓలపై ఆధారపడి ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును కలిగి ఉండాలని ఆయా గ్రామాల బీఎల్‌ఓలు ఆ దిశగా వారిని చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ చాంద్‌పాషా, హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, ట్రైనర్లు భీమప్ప, సాయిలుగౌడ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను అడ్డుకోవద్దు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాలులో టీడబ్ల్యూజేఎఫ్ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేందర్‌గౌడ్, నరేశ్, నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. నాటి స్వాతంత్ర్య ఉద్యమంతో పాటుగా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో మీడియాను నాలుగో స్తంభంగా గుర్తించడంతో పాటుగా పూర్తి స్వేచ్ఛను కల్పించాయన్నారు. గత ప్రభుత్వం మీడియా విలువలకు తిలోధకాలను ఇస్తూ పాత్రికేయుల హక్కులను కాలరాసిందని ఆరోపించారు. సమాజంలో జరుగుతున్న నిజాలను రాస్తే కొందరు నాయకులు జీర్ణించుకోలేక హత్యలు, దాడులు చేయడం, కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రాతికేయులు అసత్యాలను కాకుండా నిజాలను నిర్భయంగా రాయాలని, అప్పుడే వారికి సమాజం అండగా నిలబడుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నర్సింలు మాట్లాడుతూ.. గతంలో పత్రికకు ఎంతో విలువ ఉండేదని, వచ్చిన వార్తలకు స్పందించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునే వారమన్నారు. ఇప్పుడు పత్రికలలో వార్తలు రాస్తే దాడులు, కేసులు, బెదిరింపులకు పాల్పడే సంస్కృతి పెరిగిందని, ఇది సరికాదని హితవు పలికారు. జర్నలిస్టులు తమ స్వేచ్ఛను సక్రమంగా వినియోగించుకోవాలని, దుర్వినియోగం చేయొద్దని సూచించారు. సమావేశంలో నేతలు రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, ఎండీ.ఇబ్రహీం, శ్రీనునాయక్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్తా పాల్గొన్నారు.

లారీ, కారు ఢీ ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో దిలావర్‌గూడ మాజీ సర్పంచ్, అతని బంధువు
- కొత్తూరు రైల్వే బ్రిడ్జిపై ప్రమాదం



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

కొత్తూరు: లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మాజీ సర్పంచ్‌తో పాటు అతని బంధువు చనిపోయిన సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం, దిలావర్‌గూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పరిగి చంద్రశేఖర్‌రెడ్డి (45), అతని బంధువు నందిగామ మండలం, దేవుని మామిడిపల్లికి చెందిన ఎర్రగుంట చంద్రశేఖర్‌రెడ్డి ఇంటికి వచ్చాడు. అనంతరం రాత్రి కారులో నందిగామ నుంచి కొత్తూరు రైల్వే బ్రిడ్జిపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.



చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సబితారెడ్డి

మాజీ మంత్రి నివాళి..

మహేశ్వరం: చంద్రశేఖర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు దిలావర్‌గూడకు చేరుకున్నారు. మృతుడికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, సుభాన్‌పూర్ మాజీ సర్పంచ్ గుత్తి పద్మపాండు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన కేశగోని హరి ప్రసాద్(27) తుక్కుగూడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు డ్యూటీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన హరిప్రసాద్ సాయంత్రమైనా రాలేదు. అతడు ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై అతని తండ్రి స్వామి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

రైల్వే పట్టాల పక్కన మృతదేహం లభ్యం

కొత్తూరు: రైల్వే పట్టాల పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధి తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌సమీపంలో గురువారం వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాల పక్కన ఓ మృతదేహం పడి ఉందనే సమాచారంతో అక్కడికి చేరుకొని పరిశీలించారు. దాదాపు రెండు రోజుల క్రితం కదులుతున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి కిందపడి మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

మొయినాబాద్: గుండెపోటుతో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్‌కు చెందిన మాబారిఖాన్ సత్తార్ ఖాన్(38) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు గోధుమల లోడ్‌తో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వీఎస్‌జే అగర్వాల్ ఫుడ్స్ మిల్లుకు వచ్చాడు. అన్‌లోడింగ్ కోసం లారీని క్యూలో పెట్టి అందులోనే పడుకున్నాడు. బుధవారం రాత్రి వరకు లారీని ముందుకు కదిలించకపోవడంతో మరో లారీ డ్రైవర్ అర్జున్‌సింగ్ అతని వద్దకు వెళ్లి గమనించాడు. ఎంత పిలిచినా లేవకపోవడంతో సెక్యూరిటీ గార్డు హృదయ్ రంజన్ బెహెరాకు చెప్పాడు. అతడు వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు. విషయాన్ని సూపర్‌వైజర్‌కు భియాస్‌కు చెప్పి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి గుండెపోటుతో మరణించినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

షాబాద్: విద్యుదాఘాతంతో ఓ పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కేసారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి రవీందర్ తన పాడి ఆవును పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్ తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోజుకు 12 లీటర్ల పాలు ఇచ్చే పాడి ఆవు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందజేయాలని కోరారు.

చదువు ఇష్టంలేక పారిపోయాడు

తిరుపతిలో ప్రత్యక్షమైన గురుకుల పాఠశాల విద్యార్థి



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో బాలుడితో కుటుంబీకులు, కుల్కచర్ల, రైల్వే పోలీసులు

కుల్కచర్ల: ఇంటర్ చదవడం ఇష్టం లేక పారిపోయిన విద్యార్థి తిరుపతిలోని రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండలం రుసుంపల్లి గ్రామానికి చెందిన సందీప్ మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఇంటర్(ఎంపీసీ) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా చదవడం ఇష్టంలేని సందీప్ మంగళవారం ఉదయం గురుకుల పాఠశాల గోడ దూకి పారిపోయాడు. కుల్కచర్ల నుంచి బస్సులో మహబూబ్‌నగర్ వరకు వెళ్లి, అటునుంచి రైలులో తిరుపతికి వెళ్లాడు. బుధవారం శ్రీవారిని దర్శించుకొని అదేరోజు రాత్రికి రేణిగుంటకు చేరుకున్నాడు. తన దగ్గర డబ్బులు లేకపోవడంతో స్టేషన్‌లో ఉన్న ఒక వ్యక్తి ఫోన్‌తో తన అమ్మతో మాట్లాడాడు. ఫోన్‌పే ద్వారా రూ.500 డబ్బులు వేయాలని కోరాడు. వెంటనే ఆమె సదరు వ్యక్తితో జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో ఆయన బాలుడిని రైల్వే పోలీసులకు అప్పగించారు. గురువారం కుటుంబీకులు, కుల్కచర్ల పోలీసులు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు విద్యార్థిని కుల్కచర్లకు తీసుకువచ్చారు. విద్యార్థులు ఆలోచించి నిర్ణయాలను తీసుకోవాలని ఎస్‌ఐ రమేష్ సూచించారు.

హత్య కేసు నిందితులకు జీవిత ఖైదు

రూ.3 వేల చొప్పున జరిమానా

- తీర్పు వెలువర్చిన న్యాయస్థానం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి: వ్యక్తి హత్య కేసులో ముగ్గురు నిందితులకు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. ఎస్పీ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం బొంపల్లికి చెందిన ముద్దం శ్రీనివాస్‌కు పరిగి మండలంలోని నారాయణపూర్ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. పొలం పనులు చేసుకుంటున్న శ్రీనివాస్‌ను అతని దాయాదులైన ముద్దం గోపాలకృష్ణయ్య(కృష్ణయ్య)(38), నిదురం అంజిలయ్య(42), నిదురం నర్సమ్మ(36) పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని, 2015 జూలై 17న ఇనుప కర్రు, కట్టెలతో దాడి చేశారు. తీవ్రగాయాలైన అతను అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి బావ గొల్ల బిచ్చయ్య ఫిర్యాదు మేరకు అప్పటి పరిగి ఎస్‌ఐ, ప్రస్తుత తాండూరు రూరల్ సీఐ వై.నాగేశ్ కేసు నమోదు చేశారు. ఈసమయంలో పరిగిలో సీఐగా విధులు నిర్వహించిన ప్రస్తుత నందిగామ సీఐ పి.ప్రసాద్ కేసును దర్యాప్తు చేపట్టి జిల్లా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుధాకర్, మొదటి దర్యాప్తు అధికారి వై.నాగేశ్, సీఐ పి.ప్రసాద్, బ్రీఫింగ్ అధికారి ఎన్.శ్రీనివాస్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్, కోర్టు అధికారి(ప్రస్తుత పరిగి ఎస్‌ఐ) పి.జగన్మోహన్‌రెడ్డి, లైజన్ ఆఫీసర్ బి.వీరన్నను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

ఖబరస్తాన్ కబ్జాను అడ్డుకోండి

తహసీల్దార్‌కు ముస్లిం నేతల వినతి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మైనార్టీ నాయకులు

బషీరాబాద్: ముస్లింలకు చెందిన ఖబరస్తాన్ స్థలంలో కబ్జాలను అడ్డుకోవాలని మైల్వార్‌కు చెందిన మైనార్టీలు గురువారం తహసీల్దార్ షాహెదాబేగంకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 235 సర్వేనంబర్‌లోని 4.35 ఎకరాల భూమిలో 70 ఏళ్లుగా ఖబరస్తాన్ కొనసాగుతోందని తెలిపారు. ఈ స్థలాన్ని కొంత మంది కబ్జా చేసి పశువుల కొట్టాలు వేసుకున్నారన్నారు. ప్రస్తుతం ఇక్కడే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి నర్సిములుగౌడ్ దగ్గరుండి ఖబరస్తాన్ స్థలంలో ఇళ్లకు ముగ్గు పోయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి, కబ్జాలను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, మైనార్టీ నాయకులు ఇద్రీస్, ఇర్ఫాన్, ఖుతుబ్, అజీజ్, మహబూబ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మోమిన్‌పేట: ఉపాధ్యాయులకు జ్ఞాపిక అందజేస్తున్న అంజిరెడ్డి



తాండూరు రూరల్: కందనెల్లిలో సభ్యత్వం ఇస్తున్న తపస్ సభ్యులు

తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి

మోమిన్‌పేట: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తపస్ ముందంజలో ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఆయా గ్రామాల పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఉద్యమించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం తీసుకురావాలన్నారు. ప్రస్తుతమున్న పెన్షన్ విధానంతో ఉద్యోగులకు నష్టం జరుగుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు ఎక్కువ మొత్తంలో సభ్యత్వం పొందాలని కోరారు. కార్యక్రమంలో తపస్ మండలశాఖ అధ్యక్షుడు మధుకర్, ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యాయులు మైపాల్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తాండూరు రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనందం అన్నారు. పెద్దేముల్ మండలం కందనెల్లి ఉన్నత పాఠశాలలో గురువారం తపస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సరెండర్ బిల్లులు, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తపస్ సంఘం ద్వారా ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దేముల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, సంతోష్, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, బస్వరాజ్, మహేష్, వెంకట్, సంతోష్, అనిల్ పాల్గొన్నారు.